www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 25 జనవరి 2025

రహదారిపై కమ్ముకున్న మంచు

మంచు పరదా

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో గత రెండు రోజులుగా మంచు వర్షం చిరుజల్లులా కురుస్తుంది. దీంతో ఎదురెదురుగా ఉన్న మనుషులు కూడా కనపడని పరిస్థితి నెలకొంది. రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు కూడా దగ్గరకి వచ్చే వరకు కనబడటం లేదు. ఉదయం 9 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి చేలపై పరుచుకున్న మంచు దుప్పటిని మార్నింగ్ వాకర్స్ చూసేందుకు ఆసక్తి కనబరిచారు.

బడ్జెట్‌లో చూపారు.. ఇవ్వడం మరిచారు..!

- ఈ ఏడాది 'అన్నదాత సుఖీభవ' ఇస్తున్నట్టా.. లేనట్టా అంటూ చర్చ
- సూపర్ సిక్స్‌లో రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు హామీ
- రబీ నాట్లు చివరి దశకు చేరినా ప్రభుత్వ స్పందన కరువు
- అసెంబ్లీలో నవంబర్‌లో పెట్టిన బడ్జెట్‌లో రూ.4,500 కోట్లు కేటాయింపు
- మళ్లీ బడ్జెట్ సమావేశాలు సమీపిస్తున్నా రైతుకు చేరని సాయం
- రెండు జిల్లాల్లో 2.50 లక్షల మంది రైతులు ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'మాది రైతు ప్రభుత్వం.. అన్నదాతకే మా ప్రభుత్వంలో పెద్దపీట' అంటూ కూటమి సర్కార్ చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ సిక్స్ పేరుతో కూటమి మేనిఫెస్టోలో పెట్టిన రైతుకు పెట్టుబడి సాయం హామీ ఎప్పటికి అమలు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా రైతుకు మాత్రం సాయం సొమ్ము అందని పరిస్థితి ఏర్పడింది. రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మంది రైతులు పెట్టుబడి సాయం కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రెండు జిల్లాల వృద్ధిరేటులో 60 శాతానికిపైగా ఆదాయం వ్యవసాయంపైనే వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లో ఆరు లక్షల మందికిపైగా రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. 2024 మే నెలలో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి రైతులకు అనేక హామీలు ఇచ్చింది. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైంది రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించడం. కూటమి అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం పథకానికి 'అన్నదాత సుఖీభవ' అంటూ పేరును సైతం పెట్టింది. 2024 నవంబర్ 11న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌లో పెట్టుబడి సాయం కింద ఈ ఏడాదికి రూ.4,500 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ

ఒక్కపైసా కూడా రైతులకు పెట్టుబడి సాయం కింద అందలేదు. రెండు జిల్లాల్లో పిఎం కిసాన్ కింద సొమ్ము అందుకుంటున్న రైతులు రెండు జిల్లాల్లో 2.50 లక్షల మంది వరకూ ఉన్నారు. ఈ పథకం అందని రైతులు ఎంతోమంది ఇంకా ఉన్నారు. అన్నదాత సుఖీభవకు రైతుల అర్హుల జాబితా రూపొందించి అమలు చేయాల్సిన ప్రభుత్వం నోరు మెదపడం లేదు. దీంతో ఈ ఏడాది రైతులకు పెట్టుబడి సాయం అందేనా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. గత ప్రభుత్వం రైతుభరోసా కింద ఇచ్చిన పెట్టుబడి సాయం రెండు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేసేది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.ఆరు వేలు కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.7,500లో మే చివరి వారంలో మొదటి విడతగా రూ.5,500, జనవరిలో రెండో విడతగా రూ.రెండు వేలు రైతుల ఖాతాల్లో జమ చేసేది. దీంతో మొదటి విడత సొమ్ము ఖరీఫ్ సాగుకు, రెండో విడత సొమ్ము రబీ సాగుకు రైతులు ఉపయోగించుకునేవారు. కూటమి ప్రభుత్వం జూన్‌లో కొలువుదీరింది. వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందిస్తుందని రైతులు భావించారు. అమలుకు మాత్రం నోచుకోలేదు. రబీ సాగుకైనా ఇస్తారని రైతులు ఆశలు పెట్టుకున్నారు. రబీ నాట్లు పూర్తయిపోయాయి. ముందుగా నాటిన నాట్లు మరో నెల రోజుల్లో మాసూళ్లకు దగ్గర పడుతున్నాయి. ఇప్పటికీ ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం సొమ్ము గురించి నోరు మెదపడం లేదు. దీంతో రైతులకు పెట్టుబడి సాయం అందుతుందా అనే ప్రశ్న అందరిలో వ్యక్తమవుతోంది. ధాన్యం సొమ్ము సకాలంలో జమ చేసినప్పటికీ పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో ప్రభుత్వంపై రైతుల్లో అసంతృప్తి నెలకొంది.

మళ్లీ బడ్జెట్ వస్తున్న వేళ...

ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో పూర్తికానుంది. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2025-26 బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. మార్చి మొదటివారంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ పెట్టే పరిస్థితి ఉంది. గత బడ్జెట్‌లో రైతులకు పెట్టుబడి సాయం కింద కేటాయించిన సొమ్ము రూ.4,500 కోట్లలో చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేదు. ఇది రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రైతులను ఏమార్చేందుకు ఇలా చేశారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా వెంటనే పెట్టుబడి సాయం సొమ్ము అందించాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా కౌలురైతులకు పెట్టుబడి సాయం అందుతుందా, లేదా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు పెట్టుబడి సాయం అందించినప్పుడే వ్యవసాయం ముందుకు సాగే పరిస్థితి ఉంటుంది.

ధర్నాలో నినదిస్తున్న చేనేత కార్మికులు, నేతలు

చేనేత వృత్తి పరిరక్షణకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

కలెక్టరేట్ వద్ద చేనేత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో చేనేత వృత్తి పరిరక్షణకు టిడిపి కూటమి ప్రభుత్వం రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా కన్వీనర్ కనకం వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద చేనేత, జౌళి శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం చేనేత, జౌళి శాఖ ఎడి కొప్పర్తి అప్పారావుకి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు, వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత వృత్తి నేటికీ ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి చేనేత వృత్తిని దెబ్బతీసే విధానాలు అమలు చేస్తుందని విమర్శించారు. చేనేత వృత్తి ముడి సరుకులు నూలుపై ఐదు శాతం, రంగులు, రసాయనాలపై ఐదు నుంచి 12 శాతం వరకూ జిఎస్‌టిని విధించి కార్మికులకు ముడి సరుకులను అందుబాటులో లేకుండా చేసిందని మండిపడ్డారు. చేనేత వస్త్రాలపై ఐదు శాతం జిఎస్‌టి విధించి వస్త్ర వినియోగదారులకు చేనేత వస్త్రాలను అందుబాటులో లేకుండా దూరం చేసి చేనేత వస్త్ర మార్కెట్‌ను దెబ్బతీసిందన్నారు. కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం పథకంపై నోరు మెదపడం లేదన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి ఎత్తివేస్తామని, లేనిపక్షంలో రీయింబర్స్‌మెంట్ ఇస్తామని, చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానాలు అమలులో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు బూడిద జోగేశ్వరరావు, ఒగ్గు సత్యనారాయణ, కుర్మా పద్మావతి, రాపర్తి సత్యనారాయణ, మంచి దామోదరం, సందకర్ల లావణ్య, బత్తుల రామకృష్ణ, ఊటుకూరి దుర్గాప్రసాద్, దేశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేలా పిల్లల సంబరాలు

తణుకు బాలోత్సవం ప్రారంభ సభలో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

సాంకేతిక విజ్ఞానం పెరుగుతున్న దశలో పిల్లలపై టెక్నాలజీ ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని, ఈ పరిస్థితుల్లో వారిలో చైతన్యం తీసుకొచ్చి నిగూఢంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా బాలోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండో పిల్లల సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ జాతీయ జెండాను, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు బాలోత్సవం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవ కమిటీ అధ్యక్షులు పిఎల్.నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మన విద్యా వ్యవస్థలోనూ మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 7, 8వ తరగతుల నుండే రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ద్వారా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నారన్నారు. ఎఐ అనేది రాబోయే రోజుల్లో అత్యంత ప్రభావం చూపే అంశమన్నారు. ఉపాధ్యాయులు కూడా సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యను పిల్లలకు చేరువ చేసేవిధంగా ఉండాలన్నారు. పాఠ్యాంశాల్లోనే కాకుండా మిగిలిన అంశాలపైనా వారిని చైతన్యపర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రయివేట్ విద్యా వ్యవస్థకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దే లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. బాలోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల, బాలికలను కదిలిస్తున్నటు వంటి ఈ బాలోత్సవం మీ జీవితంలో ఇది ఒక తీపి గుర్తుగా ఉండాలని అన్నారు. 60 ఈవెంట్స్‌లో పాల్గొనేలా సుమారుగా 70 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులను తీసుకొచ్చినటువంటి ఉపాధ్యాయులను, విచ్చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. మనిషి పుట్టిన తరువాత సమూహంలోకి వచ్చేటు వంటి తొలి వేదిక పాఠశాలని అన్నారు. బడి నేర్పే పాఠాలతోపాటు సమూహంలో ఉండటం ద్వారా వచ్చేటువంటి ఈ విజ్ఞానం కూడా చాలా విలువైనదన్నారు. మన దేశంలో మొట్టమొదటిగా 1990లో కేరళలో కేరళ సాహిత్య పరిషత్ అనే ఒక సైన్స్ సంస్థ (స్వచ్ఛంద) ఈ బాలోత్సవాలకు ప్రేరణ కలిగించిందన్నారు. మన రాష్ట్రంలో జనవిజ్ఞాన వేదిక అనే సంస్థ ఈ బాలోత్సవాల నిర్వహణ మొదలుపెట్టిందన్నారు. జవాబులు కాదు ప్రశ్నలు అడిగేవాళ్లే మంచి విద్యార్థులు అని అన్నారు. ఎన్ని ఎక్కువ ప్రశ్నలు అడిగితే అంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రశ్నే ఈ సైన్స్‌ను అభివృద్ధి చేసిందన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి, నేత ఎఎస్‌వి.శేషుబాబు, ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ ఎంఎస్ఆర్.ఆంజనేయులు, రూట్స్ స్కూల్ డైరెక్టర్ బి.విద్యాకాంత్, మానవత సంస్థ ఛైర్మన్ గమిని రాంబాబు, కొమ్మిరెడ్డి శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం జెండా ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

వివిధ వేషధారణల్లో విద్యార్థులు

ఉత్సాహంగా సాగిన అకడమిక్, కల్చరల్ పోటీలు

వ్యాసరచన, వక్తృత్వం, పద్యం-భావం, మ్యాప్ పాయింటింగ్, బెస్ట్ ఫ్రమ్‌వేస్ట్, శాస్త్రీయ నృత్యం (సోలో), ఏకపాత్రాభినయం, లఘునాటిక (బృందం), అభ్యుదయ, దేశభక్తి గీతాల ఆలాపన (సోలో), క్విజ్ రాత పరీక్ష అంశాల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఫ్యాన్సీ డ్రెస్ (సబ్ జూనియర్స్) విభాగాల్లో పోటీలు సాగాయి.

విద్యార్థిని నృత్య ప్రదర్శన

విద్యార్థినితో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

రహదారుల భద్రతపై అవగాహన తప్పనిసరి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వాహన చోదకుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలతో కుటుంబాలకు తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారని, రహదారుల భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.శ ుక్రవారం స్థానిక బివి.రాజు కళాశాల ఆడిటోరియంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రహదారుల భద్రతపై అవగాహనా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మన గురించి కంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల గురించి ఎల్లప్పుడూ గుర్తుంచుకుని సరైన రహదారుల భద్రతతో వాహనాలను నడపాలన్నారు. జిల్లాలో 2023-24 సంవత్సరంలో 194 మంది ప్రమాదాల్లో మృతి చెందారని, సుమారు 500 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడిపే వారిని గుర్తించి వారి ఫోన్ డిపాజిట్ చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిటిఒకు సూచించారు. రహదారుల భద్రతపై అవగాహనకు విష్ణు కాలేజీ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్లను అభినందించారు.

'గుడ్ సమరిటన్ లా'పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

ప్రమాద సమయంలో ఏ వ్యక్తులైన పూర్తి స్వేచ్ఛతో సహాయం చేయవచ్చునని, వారి వివరాలను పోలీస్ సిబ్బందికిగాని, హాస్పిటల్స్‌కుగాని తెలియజేయాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. హాస్పటల్‌కు తీసుకెళ్లిన సందర్భంలో హాస్పటల్ సిబ్బంది కూడా తీసుకొచ్చిన వారి వివరాలను అడగరాదని, వైద్యం నిరాకరిస్తే సంబంధిత యాజమాన్యంపై క్రిమినల్ చర్యలతోపాటు లైసెన్సును కూడా రద్దు చేస్తారని ఈ చట్టంలో ఉందన్నారు. వైద్య ఖర్చులు చెల్లిస్తేనే వైద్యాన్ని ప్రారంభిస్తామని కూడా ఆసుపత్రి యాజమాన్యం నిరాకరించరాదన్నారు. సహాయం చేసిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ గాని, క్రిమినల్ కేసులుగాని పెట్టరాదన్నారు. ప్రమాద సమయంలో భయపడకుండా సహాయాన్ని అందించాలని సూచించారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆడపిల్లలు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో ఆడపిల్లలను భాగస్వాములను చేశామన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా 60 నుండి 70 శాతం మరణాలను నిరోధించవచ్చన్నారు. ఎవరూ అపసవ్య దిశలో ప్రయాణించొద్దని సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వాహన చోదకులకు కళ్లజోళ్లను, రహదారుల భద్రత అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విష్ణు కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటరామరాజు, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ గిరీష్‌కుమార్, ఎంవిఐలు సిహెచ్.వెంకటరమణ, కెఎస్ఎన్.ప్రసాద్, ఎఎంవిఐలు ఎం.రల్లికుమార్, ఎన్ఎల్ఎస్.లక్ష్మి, ఎస్‌వివి.సత్యనారాయణ, ఎఎస్‌పి.తేజ, ఎన్‌వైకె యువ వాలంటీర్ కె.రాజేష్, వివిధ కళాశాలల, పాఠశాలల వాహన చోదకులు, వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు కళ్లజోడు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

4న ఎస్ఆర్‌కెఆర్‌లో కోడింగ్ కాంపిటేషన్!

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4వ తేదీన కళాశాలలో కోడింగ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. శుక్రవారం ఈ సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగపతి రాజు మాట్లాడుతూ కోడింగ్ కాంపిటీషన్ రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం విద్యార్థులకు, ఎక్స్‌పర్ట్ లెవెల్లో మూడవ సంవత్సరం, నాలుగో సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెక్నాలజీలో ఎంత మార్పులు చోటు చేసుకున్నప్పటికీ కోడింగ్‌లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థి అన్ని రంగాలలో విజయం సాధించగలరని, అందువల్లే ప్రత్యేకంగా కోడింగ్ కాంపిటేషన్ మొదటి సంవత్సరం నుంచి ఫైనల్ ఇయర్ వరకు రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడింగ్ క్లబ్ కన్వీనర్ కె.డేవిడ్ రాజు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్.రామకృష్ణంరాజు, ప్లేస్మెంట్ సెల్ డీన్ డాక్టర్ కెఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న పలువురు

ఇన్‌ఛార్జి ఎంపిపిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యలమంచిలి

మండల ఇన్ ఛార్జి ఎంపిపిగా గొల్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ఎంపిపిగా బాధ్యతలో ఉన్న రావూరి వెంకటరమణ వైసిపి అంతర్గత ఒప్పందంలో భాగంగా తన పదవికి రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఎంపిపి స్థానం ఖాళీగా ఉంది. దీంతో జిల్లా కలెక్టర్, సిఇఒ ఆదేశాలతో ఇప్పటి వరకు వైఎస్ ఎంపిపి-1గా బాధ్యతల్లో ఉన్న కనకాయలంక గ్రామ ఎంపిటిసి సభ్యుడు గొల్లపల్లి శ్రీనివాసరావు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచుల సమక్షంలో ఎంపిపిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావును వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ ఎడ్ల తాతాజీ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహాయ సహకారాలతో యలమంచిలి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రేమాన్విత, పలువురు ఎంపిటిసి సభ్యులతో పాటు కనకాయలంక, చించినాడ, కాజ తూర్పు, బాడవ, మేడపాడు అబిరాజుపాలెం సర్పంచులు మద్దా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్‌ను కాపాడాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

బాలికల బంగారు భవిష్యత్‌ను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్‌ను కాపాడవలసిన బాధ్యత మనందరిపైన ఉందని, బాలికల భద్రత, ఆరోగ్యం, విద్యపై అందరూ బాధ్యతగా మెలగాలన్నారు. బాలికలు అందరూ బడిలో ఉండి చదువుకోవడం ద్వారా సమాజం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. నేటి బాలలే రేపటి భవిష్యత్ నిర్దేశకులన్నారు. వారి బాధ్యత తల్లిదండ్రులదే కాకుండా విద్యను బోధించే అధ్యాపకులతో సహా అందరూ బాలబాలికల భద్రత, ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ చూపాలని కోరారు. బాలికలను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాలికలకు ఇబ్బంది ఎదురైతే డయల్ 100 పోలీస్ శాఖ, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, ఎమర్జెన్సీ 112 నెంబర్లకు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాత రాణి, డిఇఒ ఇ.నారాయణ, డిసిపిఒ ఆర్.రాజేష్, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

27 నుంచి యానిమేటర్ల దీక్షలు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

డ్వాక్రా యానిమేటర్ల కాల పరిమితి సర్క్యులర్‌ని రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27, 28, 29 తేదీలలో కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న దీక్షలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం డ్వాక్రా యానిమేటర్లతో సమావేశం డ్వాక్రా యానిమేటర్ల సంఘం నాయకులు గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళన చేసిన డ్వాక్రా యానిమేటర్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పలుసార్లు ప్రభుత్వానికి మెమొరండాలు అందజేశారని, ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఈ నేపథ్యంలో యూనియన్ రాష్ట్ర కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద దీక్షలు చేపట్టాలని నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులు, స్కీంవర్కర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఆయా సంఘాల నాయకత్వాలను పిలిచి సమస్యలపై చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటికి తోడు రాజకీయ వేధింపులు కూడా మరింత తీవ్రమయ్యాయన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, డ్వాక్రా యానిమేటర్లు పుష్పలత, హేమలత, నాంచారమ్మ, లక్ష్మీ కుమారి, రాణి పాల్గొన్నారు.

గీత కార్మికులకు 18 మద్యం షాపులు కేటాయింపు

లాటరీ తీసిన కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని గీత కార్మికులకు కులాల వారీగా 18 మద్యం షాపుల కేటాయింపుకు ప్రాంతాల ఎంపికను లాటరీ పద్ధతిలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో నిర్ణయించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గీత కార్మిక కులాలకు మద్యం షాపుల కేటాయింపుకు జిల్లా కలెక్టర్ లాటరీ విధానంలో టోకెన్ తీసి ప్రాంతాలను ఎంపిక చేశారు. ప్రభుత్వం జిల్లాలోని గీత కార్మిక కులాలైన శెట్టిబలిజకు-10, గౌడకు-5, గౌడ్‌కు-2, శ్రీశైన-1 మొత్తం 18 షాపులను కేటాయించడం జరిగింది. భీమవరం-శెట్టిబలిజ, తణుకు-శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం-గౌడ, నరసాపురం-శెట్టిబలిజ, ఆకివీడు నగర పంచాయతీ-శెట్టిబలిజ, ఆకివీడు రూరల్ - గౌడ, గణపవరం-గౌడ, అత్తిలి-శ్రీశైన, ఇరగవరం-గౌడ, నరసాపురం రూరల్-శెట్టిబలిజ, వీరవాసరం-గౌడ, ఆచంట-శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం రూరల్-గౌడ, మొగల్తూరు-శెట్టిబలిజ, పెనుగొండ-శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం రూరల్-శెట్టిబలిజ, తణుకు రూరల్-శెట్టిబలిజ, పెనుమంట్ర-గౌడ, పోడూరు-శెట్టిబలిజ కులాలకు లాటరీ పద్ధతి ద్వారా రిజర్వ్ చేయడం జరిగింది. ఈ నెల 25వ తేదీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, 27 నుంచి దరఖాస్తు, ఆన్‌లైన్, హైబ్రిడ్ విధానాల ద్వారా రూ.2 లక్షల దరఖాస్తు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుకు గడువు ఫిబ్రవరి 5 సాయంత్రం 5 గంటల వరకు నిర్ణయించడం జరిగిందన్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ కెఎన్‌వి ప్రభు కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

డిఆర్‌ఒకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఆర్ఒ వెంకటేశ్వర్లుకు స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను తక్షణం నియమించాలని, ఐఆర్, డిఎలను ప్రకటించాలని, ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాలని, 2003లో నియామక ప్రక్రియ పూర్తయి ఉద్యోగ నియామకం పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తక్షణం పాత పెన్షన్ వర్తింపజేయాలని నేతలు కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షులు కోరం రాజశేఖర్, ట్రెజరర్ పి.క్రాంతికుమార్, జిల్లా కార్యదర్శులు కెఎస్‌సిహెచ్.సాయిరాం, జి.రామకృష్ణంరాజు, చింతపల్లి కుమారబాబ్జి, కె.శ్రీరామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు, నాయకులు పి.రామ్మూర్తినాయుడు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

జనరల్ ఫండ్స్ బిల్లులు ట్రెజరీ పరిధిలోకి రావు

ఆడిట్‌లో భాగంగా కార్యదర్శులు హాజరు

భీమవరం సబ్ ట్రెజరీ అధికారి వర్మ

'ప్రజాశక్తి' కథనంపై వివరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్స్ (సాధారణ నిధులు) బిల్లులు ట్రెజరీ పరిధిలోకి రావని, అకౌంటింగ్ విధానం ఈ కార్యాలయ కోడ్ పరిధిలో ఉన్నందున ఎజి (అకౌంటెంట్ జనరల్) ఆడిట్ చేశారని, ఆడిట్‌లో భాగంగా సంబంధిత అధికారులు సమాచారం తెలుకునేందుకు పంచాయతీ కార్యదర్శులను పిలిచారని భీమవరం సబ్ ట్రెజరీ అధికారి వర్మ తెలిపారు. 'కాసులు ఇస్తే.. లెక్క సరిపోతుందా' శీర్షికన శుక్రవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. దీనికి సంబంధించిన వివరణను నోట్ రూపంలో ఇచ్చారు. భీమవరం సబ్ ట్రెజరీ కార్యాలయంలో అకౌంటెంట్ జనరల్ విజయవాడ కార్యాలయ సిబ్బంది వార్షిక తనిఖీల్లో భాగంగా గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్స్‌పై అడిట్ చేశారని పేర్కొన్నారు. సంబంధిత గ్రామపంచాయతీల జనరల్ ఫండ్స్ రికార్డుల పరిశీలన నిమిత్తం పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వడం, వారిని రావాల్సిందిగా ఎజి అధికారులు కోరగా, పంచాయతీ కార్యదర్శులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారొచ్చి ఆడిట్ అధికారులకు వివరణ ఇవ్వడం, రికార్డులు పరిశీలన చేసుకోవాలని చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. జనరల్ ఫండ్స్ బిల్లుల చెల్లింపులు నేరుగా పంచాయతీల నుండి ప్రభుత్వానికి చేరతాయన్నారు. ఇందులో ట్రెజరీ ప్రమేయంగానీ, వారి రికార్డుల పరిశీలనగాని ట్రెజరీలో ఉండవన్నారు. ఎజి విజయవాడ ఆడిట్ వారికి గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్స్ బిల్లుల చెల్లింపుల విషయంలో తనిఖీ చేయడం వారి విధుల్లో భాగమన్నారు. ఈ సందర్భంగా కొన్ని పంచాయతీల్లో జనరల్ ఫండ్స్ విషయంలో బిల్లులు సరిగా లేవని ఆడిట్ అధికారులు గుర్తించడం, ఆడిట్ అభ్యంతరాలు రాయటం జరిగిందని వారు చెప్పగా తమకు తెలిసిందన్నారు. వాటి పూర్తి వివరాలు 2024- 25 ఆర్థిక సంవత్సరం రిపోర్టు వచ్చిన తర్వాత తెలుస్తుందని వివరించారు. ఈ వార్షిక ఆడిట్‌లో భాగంగా సంబంధిత గ్రామపంచాయతీల కార్యదర్శులు ఈ కార్యాలయానికి హాజరవ్వడం అసలు వాస్తవమని, ఈ ఆడిట్ సందర్భంగా పంచాయతీల బిల్లులు, రికార్డులు పరిశీలన నిమిత్తం ఎటువంటి ఆర్థిక లావాదేవీలూ ఈ కార్యాలయంలో జరగలేదని తెలిపారు. ఈ కార్యాలయ అధికారి, సిబ్బందికి ఈ విషయంలో ఎటువంటి పాత్రా లేదని పేర్కొన్నారు. ఎజి అధికారులు ఆడిట్ అభ్యంతరాలు గుర్తించినట్లు తేలితే రాబోయే ఆడిట్ రిపోర్టు ద్వారా తెలుస్తుందన్నారు.

చదరంగంలో శిక్షణ

వీరవాసరం: విద్యార్థి దశ నుంచి మేధాశక్తిని ఆలోచనాశక్తి పెంపొందించుకోవాలని, అందుకు చదరంగం ఒక మంచి మార్గమని పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ అన్నారు. రెండు రోజుల పాటు దూసనపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు చదరంగంలో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ శిక్షణలో ముప్పై మంది విద్యార్థులు చదరంగం నేర్చుకోవడానికి ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యు.బంగారుబాబు, ఉపాధ్యాయులు సుదర్శన్కుమార్, జి.పెద్దిరాజు, భానుమహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రై డే డ్రై డే పాటించాలి

తాడేపల్లిగూడెం : ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించుట ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 6, 7 వార్డులలో జరుగుతున్న ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు బుద్ధ మేరీ, శాంత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ తనిఖీ

నరసాపురం : పట్టణంలోని 3, 7, 17వ వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పారిశుధ్య నిర్వహణ తనిఖీ చేశారు. వార్డుల్లో శానిటేషన్ సరిగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. బస్టాండ్ ఏరియా, శివాలయ ప్రాంతాల్లో శానిటేషన్ను పర్యవేక్షించారు. ప్రతిరోజు ప్రత్యేక శానిటేషన్ నిర్వహించాలని, సచివాలయ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రెటరీస్ వారిని ఆదేశించారు.

ఆర్టిసిలో డ్రైవర్ల పాత్ర కీలకం

ఆర్టిసి డిఎం సత్యనారాయణ

భీమవరం టౌన్ : ఏపిఎస్ ఆర్టిసిలో డ్రైవర్ల పాత్ర కీలకమని ఎపిఎస్ఆర్టిసి డిపో మేనేజర్ పిఎస్ఎం.సత్యనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం డ్రైవర్స్ దినోత్సవంలో భాగంగా ఆర్టిసి బస్టాండ్లో డ్రైవర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి చాలా ప్రధానమైనది, కీలకమైనది, ముఖ్యంగా ఆర్టిసి వ్యవస్థలో డ్రైవర్ పాత్ర చాలా ముఖ్యమని, రోజుకు వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడంలో డ్రైవర్ చిత్త శుద్ధితో విధులు నిర్వహిస్తారన్నారు. అసిస్టెంట్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ డ్రైవర్స్ డే రోజున విధులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది డ్రైవర్లను ఎంపిక చేయడమైనదని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను సివి రామన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ద్వారా శ్రీజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

హెల్మెట్ తప్పనిసరి

మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాయక్

తాడేపల్లిగూడెం : మండలంలోని పెద్ద తాడేపల్లి లోటస్ హై స్కూల్లో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టిఓ నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్లతో పాటు విద్యార్థులకు రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నాయక్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. లోటస్ స్కూల్ ప్రిన్సిపల్ లోకేశ్వరి దేవి ప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ బస్ డ్రైవర్లు, క్లీనర్లకు తగు సూచనలు, సలహాలు తెలియజేశారు.

నేటి నుంచి ఆక్యూ ప్రెజర్ చికిత్సా శిబిరం

పెనుమంట్ర : మండలంలోని మానవతా సంస్థ మార్టేరులోని ఇండస్ట్రీ కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ఆక్యూ ప్రెజర్ ఉచిత చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు మానవత నిర్వాహకులు తెలిపారు. మార్టేరులోని మారెమ్మ పుంత రోడ్డులోని ఇండస్ట్రీ కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ భవనంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, ఆరు రోజుల చికిత్సకు రూ.200 చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మానవత జిల్లా కార్యదర్శి, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణ మూర్తి, స్థానిక మానవతా సంస్థ అధ్యక్షులు పిడి కృష్ణారెడ్డి, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, నరసాపురం ఆర్టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి తెలిపారు. జోధపూర్కు చెందిన ప్రముఖ ఆక్యూ ప్రెజర్ వైద్యులు డాక్టర్ తాన్ రాజ్ చౌదరి, డాక్టర్ కేశవ చౌదరి హాజరవుతారని వారు తెలిపారు.

నట్టల నివారణ మందు పంపిణీ

గణపవరం : పశువులు పుట్టినప్పటి నుంచి పెద్ద అయ్యే వరకు పాముల మందు వేయటం వల్ల సరియైన సమయంలో పశువులు ఎదకు వస్తాయని గణపవరం వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డిఎం.నాయక్ అన్నారు. శుక్రవారం ఎస్.కోండేపాడులో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి సీతాళం పుల్లయ్య నాయుడు ప్రారంభించారు. సర్పంచి పుల్లయ్య నాయుడు మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు ఉపయోగించుకొని, పశువులకి వచ్చే వ్యాధుల నివారణకు వైద్యం అదించాలని అన్నారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు, నట్టల నివారణకు మందులు అందజేశారు. 19 పశువులకు మినరల్ మిక్సర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.నాగజ్యోతి, వి.అన్నవరం, యానిమల్ హెస్బెండర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

3న ఉండి ఐటిఐలో జాబ్మేళా

ఉండి : ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో ఫిబ్రవరి మూడో తేదీన నిర్వహించే జాబ్మేళాను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని ఉండి ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని అక్కమాంబ టెక్స్టైల్స్లో పని చేసేందుకు ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఫిట్టర్ ట్రేడ్లు పూర్తి చేసిన వారికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అప్రంటిస్షిప్ చేసే సమయంలో రూ.పది వేలు అక్కమాంబ టెక్స్టైల్స్ యాజమాన్యం అందిస్తుందని, ఈ అవకాశాన్ని ఐటిఐ పూర్తి చేసిన విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎరువుల పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

నరసాపురం : ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'అందని యూరియా' కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో, ప్రయివేటు డీలర్ల వద్ద ఏకకాలంలో నరసాపురం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిల్ కుమారి, మండల వ్యవసాయ అధికారి ఎం.సామ్యూల్ జాన్సన్, ఎఇఒ లక్ష్మీనారాయణలచే ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎడిఇ అనిల్ కుమారి మాట్లాడుతూ రైతులు తగిన సమయంలో కావలసిన మోతాదు మేరకే కొనుగోలు చేయాలని, అత్యధిక మోతాదులు కొనుగోలు చేయవద్దని సూచించారు.

ప్లాస్టిక్ నిషేధంతో అనేక ప్రయోజనాలు

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

భీమవరం : ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణహితంతో పాటు జీవవైవిధ్యం, ఆరోగ్యం వంటి ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం విస్సాకోడేరు వంతెన వద్దనుంచి తిరుమల స్కూలు వరకు ప్లాస్టిక్ వాడకం నిర్మూలిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఆర్ఒ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ను ఎప్పుడైతే నిషేధిస్తామో పర్యావరణానికి మానవ జీవన వైవిధ్యం ఆరోగ్యంకరంగా ఉంటుందని అన్నారు. డిఆర్డిఎ పిడి ఎంఎస్ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

తాగునీటికి సహకరించరా!

ఆకివీడు : వాటర్ ఫిల్టర్ మరమ్మతులకి ఎంత కాలం నుంచి నిధులు కోరినా ఇవ్వకపోవడమేమిటని మందపాడు గ్రామ సర్పంచి గుర్రం బాల వెంకటేశ్వరరావు ఆర్డబ్ల్యూఎస్ ఎఇ కె.భోగరాజును నిలదీశారు. శుక్రవారం ఎంపిపి కటారి జయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై ఎజెండాగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భోగరాజు మాట్లాడుతుండగా వెంకటేశ్వరరావు లేచి ఎంతోకాలంగా తాగడానికి సరియైన మంచినీరు అందటం లేదని, మంచినీరు పురుగులతో నిండిపోతొందన్నారు. నీరు పసరు పట్టి దురదలు వస్తున్నాయని వివరించారు. వాటి నివారణకు సాండ్ ఫిల్టర్లలో ఇసుక మార్చవలసిందని అన్నారు. ఏవిధమైన నిధులు లేని అతి చిన్న పంచాయతీ తమదని ఆయన అన్నారు. అధికారులు ఏ విధమైన సమాధానం చెప్పకుండానే ముందుకు సాగారు. మండల ఉపాధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఘనంగా పలుచోట్ల జాతీయ బాలికల దినోత్సవం

ఆచంటలో..

ప్రజాశక్తి - యలమంచిలి

సమాజంలో బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ సిడిపిఓ నాగరత్నం అన్నారు. మండలంలోని దొడ్డిపట్ల, యలమంచిలి, మట్లపాలెం, చించినాడ, కలగంపూడి తదితర గ్రామాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఆయా అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ 1966లో జనవరి 24వ తేదీన మొట్టమొదటిసారిగా ఇందిరా గాంధీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రోజున గుర్తుగా ప్రతి ఏడాది బాలికా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బాలికల సంరక్షణ, హక్కులు, విద్య, సామాజిక ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు నాగలక్ష్మి, కృపావతి, హెల్త్ సూపర్వైజర్ కిరణ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు వి.పద్మశ్రీ, బి.రజిని పాల్గొన్నారు.

గణపవరం : పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్.దుర్గారభవాని బాలికలకు విద్య ప్రాముఖ్యతను, ఆరోగ్యం, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పి.జయ వెంకటేశ్వర్లు, ఎఎన్ఎం వాణిశ్రీ, ఎంఎల్ఎహెచ్ పి.దిలీప్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఆచంట : కిశోర బాలికలు పౌష్టికాహారంతో పాటు ఉన్నత విద్య, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.సూర్యకుమారి అన్నారు. వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కిశోర బాలికలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నెక్కంటి కృష్ణవేణి, ఉపాధ్యాయులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వీరవాసరం : జాతీయ బాలికల దినోత్సవం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వీరవాసరం ఎంఆర్కె జిల్లా పరిషత్ హై స్కూల్లో శుక్రవారం నిర్వహించారు. బాలికలందరూ చక్కగా చదువుకొని ఉన్నతమైన స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జడ్పిహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ పిబివిఎల్.సరోజినీ పాల్గొన్నారు.

పెనుమంట్ర : సమాజంలో బాలికలను ఉన్నతంగా చూడాలని, అది అందరూ సామాజిక బాధ్యతగా భావించాలని పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ అంగర కృష్ణకుమారి అన్నారు. మార్టేరు(నెగ్గిపూడి)లోని ఎస్విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మార్టేరు నాలుగు రోడ్ల సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ టి.పోశమ్మ పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని జివిఎస్విఆర్యం మున్సిపల్ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం భవానీప్రసాద్ రాయపూడి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులు భవాని దుర్గ, చంద్రకళ, బాలికలు పాల్గొన్నారు.

తణుకు : చదువుతో పాటు బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సిడిపిఓ ఎం.ప్రమోది అన్నారు. శుక్రవారం తణుకులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(బాలికల) జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోట వరలక్ష్మి, టి.వినోద, అంగన్వాడీ టీచర్స్ జిఎం.రాజకుమారి పాల్గొన్నారు.

మొగల్తూరు : ఆడపిల్లలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని సిడిపిఓ ఊర్మిల అన్నారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్లు కె.పద్మావతి ఉన్నారు.

తణుకు రూరల్: ఇరగవరం మండలం గోటేరు గ్రామంలో పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రేలంగి పశు వైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ పివిఎన్ టివి ప్రసాద్ 59 పశువులను పరీక్షించి మందులు అందజేశారు. టిడిపి మండల ప్రెసిడెంట్ గోపిశెట్టి రామకృష్ణ, సర్పంచి జుత్తిగ గాయత్రి పాల్గొన్నారు.

ఉండి: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బి.సాయి చంద్ర అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం : బాలికల చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ అన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణా యూనిట్ కార్యాలయం-మిషన్ వాత్సల్య వారి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీ భాయి పురపాలక బాలికోన్నత పాఠశాల స్కూల్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ హై స్కూల్లో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.రాము మాట్లాడారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మంగ, ఉపాధ్యాయులు వివిఎస్ఎన్.మూర్తి, కె.రమణ పాల్గొన్నారు.

కలవపూడి హైస్కూల్లో సామాజిక తనిఖీ

కాళ్ల : మండలంలోని కలవపూడి హైస్కూల్లో ఉపాధి హామీ బృందం సభ్యులు సామాజిక తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో భాగంగా కలవపూడి హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి పనుల సామాజిక తనిఖీలో భాగంగా పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు వసతులు, విద్యాకానుక, తదితర రాయితీలు సరిగ్గా అందాయా లేదా అనే దానిపై తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి పాఠశాల అభివృద్ధికి ఇస్తున్న నిధుల వినియోగంపై పరిశీలించారు. ఈ సామాజిక తనిఖీకి రిసోర్స్ పర్సన్స్ వెంకటేష్, ప్రభాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జిహెచ్.ప్రియాంక, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన

వీరవాసరం : అనారోగ్యంతో మంచానికే పరిమితమైన పెన్షన్దారులను ప్రత్యేక వైద్యబృందం శుక్రవారం పరిశీలించింది. వీరవాసరం, నందమూరుగరువు, మేంటేపూడి, బాలేపల్లి గ్రామాలలో ఈ బృందం పర్యటించి లబ్ధిదారులు గతం కంటే వారి ఆరోగ్యం మెరుగైందా, వాస్తవంగా అర్హులా కాదా అనే కోణంలో ప్రతీ లబ్ధిదారుని వద్దకు వెళ్లి పరిశీలించారు. పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు, రక్తహీనత కలిగి అనేక మంది అనారోగ్యాలకు గురై మంచానికే పరిమితమైన వారికి ప్రభుత్వం ప్రతీ నెల రూ.15 వేలు అందజేయడం జరుగుతుంది. ఈ క్రమంలోనే లబ్ధిదారుల వాస్తవస్థితిని ప్రత్యేక వైద్య బృందం పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరుగుతుంది. గతంలో మంచానికే పరిమితమైన వారు ప్రస్తుతం డబ్బై శాతం మంది ఆ స్థితి నుంచి కోలుకోవడం జరిగినట్టు సమాచారం. భీమవరం డివిజన్లో 523 మంది, వీరవాసరంలో 66 మంది ఈ కేటగిరిలో పెన్షన్ పొందుతున్నారు. ఈ పరిశీలన బృందంలో వైద్యులు జి.అరవింద్, బి.సుహాసిని, మొహసిని తాజ్లు పాల్గొన్నారు.

ఎంఆర్సి భవనం పరిశీలన

వీరవాసరం : గత పదిహేను సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన విద్యాశాఖకు చెందిన మండల రిసోర్సు(ఎంఆర్సి) భవనాన్ని శుక్రవారం ఎంపిపి, వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, ఎంఇఒ శ్రీమన్నారాయణ పరిశీలించారు. వీరవాసరం ఎంఆర్కె హైస్కూల్లో ఉన్న ఈ అసంపూర్తి భవనం నిధుల కొరతతో నిలిచిపోయింది. దీంతో మండల విద్యాశాఖకు సరైన వసతి లేకపోవడంతో సిబ్బంది విధులు నిర్వర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ఎంపిపి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె సానుకూలంగా స్పందించారు. భవనం పూర్తి కావడానికి ఎంత మేరకు నిధులు అవసరమో అంచానాలు తయారు చేయాలని పిఆర్ఎఇని ఆదేశించారు. ఎంఎల్ఎ అంజిబాబు దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే దాతల సహకారంతో నిధులు సమకూర్చి, భవనం పూర్తి చేస్తామని ఎంపిపి తెలిపారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, సత్య, మణికంఠలు పాల్గొన్నారు.

విజయవాడ ప్రత్యేక కోర్టుకు మంత్రి నిమ్మల

పాలకొల్లు : విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు శుక్రవారం మంత్రి రామానాయుడుతో పాటు పలువురు టిడిపి నాయకులు హాజరయ్యారు. 2019 ఆగస్టులో వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించిన ఆశ వర్కర్లకు న్యాయపరంగా అండగా నిలిచిన మంత్రి రామానాయుడుతో పాటు పలువురు పార్టీ శ్రేణులపై నాడు అక్రమ కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచి గత 4 సంవత్సరాలుగా విజయవాడ ప్రత్యేక కోర్టుకు హాజరవుతున్నారు.

మంత్రికి న్యాయవాదుల ప్రశంసలు

కోర్టు బయట మంత్రి రామానాయుడును పలువురు న్యాయవాదులు కలిసి ప్రశంసించారు. విజయవాడ బుడమేరుకు గండ్లు పూడిక సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాత్రింబవళ్లు పడిన శ్రమను, కష్టాన్ని గుర్తుచేస్తూ ప్రశంసలు కురిపించారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

ఆచంట : విద్యా ప్రమాణాల పెంపులో భాగంగా ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని జెడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. వల్లూరు మహిళా జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ నరసింహ మాట్లాడుతూ వల్లూరు జూనియర్ కళాశాలకు దాతలు, పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమని కొనియాడారు. వల్లూరు ఎంపీ పాలెం మహిళా కళాశాలలో పదవ తరగతి 1979-89 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫిజిక్స్ జువాలజీ లాబ్ అభివృద్ధి నిమిత్తం రూ.లక్ష 7 వేలు, బోటనీ ల్యాబ్ నిమిత్తం ముత్యాల చిట్టిబాబు రూ.45 వేలు, ఫిజిక్స్ ల్యాబ్ పర్నిచర్ నిమిత్తం చావలి సీతారామారావు రూ.25 వేలు కళాశాల అభివృద్ధి నిమిత్తం అందజేశారు. సర్పంచి నేలపూడి బేబీ, ఎస్ఎంసి చైర్మన్ జాన్స్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

పెనుగొండ : మండలంలోని కొఠాలపర్రు గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు నూకయ్య కిడ్నీ ఇన్ఫెక్షన్తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న దేవ గ్రామం ఎస్ఎమ్బిటిఆర్ జెడ్పి హైస్కూల్లో 1995-96 10వ తరగతి పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడైన నూకయ్యకు అండగా మేము ఉన్నామని మానసిక ధైర్యం చెప్పి రూ.లక్షా 12 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సహకారానికి అందరినీ ఒక తాటిపై తెచ్చిన బివి.రమణను అభినందించారు.

రోగాల పట్ల అవగాహన

భీమవరం టౌన్ : దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల రోగాలను గుర్తించవచ్చు వచ్చని జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ ధనలక్ష్మి అన్నారు. ఇంటింటా కేన్సర్ సర్వేలో భాగంగా శుక్రవారం భీమవరంలోని గూట్లపాడు గ్రామంలో సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఇంట్లో ఉన్న వారి ఆరోగ్య వివరాలను తెలుసుకొని కేన్సర్ వంటి రోగాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

కుళ్లిపోయిన వరినాట్ల పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఆచంట : మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే దుష్ఫలితాలు ఏర్పడతాయని మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రజాశక్తిలో వచ్చిన 'మందు చల్లితే కుళ్లిపోయిన నాట్లు' అనే శీర్షికకు స్పందించిన అధికారులు శుక్రవారం గుబ్బల సోమేశ్వరరావు కౌలు రైతు పంట పొలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ మండలంలోని ఆచంట పంచాయతీ పరిధి వంకతాళ్ల చెరువు గ్రామంలో గుబ్బల సోమేశ్వరరావు కౌలు రైతుకు చెందిన ఎకరం 10 సెంట్లలో ఆఖరి దమ్ములో 100 కేజీల 20.20 0.13. కాంప్లెక్స్ ఎరువులు, 6 కేజీల ఇండులైజర్ అనే గ్రోత్ ప్రమోటర్ మోతాదుకు మించి ఊడుపు దశలో వినియోగించడం వల్ల వేరు వ్యవస్థ దెబ్బతిని, మూనలు కుళ్లిపోయాయని అన్నారు. దాళ్వా సీజన్కు సిఫార్సు చేయబడిన ఎరువుల మోతాదు 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ను అందించే సూటి ఎరువులను, కాంప్లెక్స్ ఎరువులను వేయాలన్నారు. ఎరువుల వినియోగంలో రైతులందరూ మోతాదుకి మించి వాడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, డీలర్లు మోతాదు మించి విక్రయించకూడదని, డీలర్లు అందరికీ నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహనుండాలి

ఎస్ఐ కె.వెంకటరమణ

ఆచంట: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ అన్నారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలు, క్రిమినల్ కేసులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర నరసింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి : వ్యకాస

కాళ్ల : పనులు లేక ఇబ్బంది పడుతున్న కూలీలందరికీ ఉపాధి హామీ పని చూపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ దళిత వాడలలో సమస్యలపై సర్వే చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కాళ్ల మండలం ప్రాతళ్లమెరక దళిత పేటలో సర్వేను శుక్రవారం నిర్వహించారు. ఈ సర్వేలో ప్రధానంగా పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నట్లు సర్వేలో తెలిపారు. మంచినీరు రూ.20 నుంచి 30 పెట్టి కొనుక్కుని తాగే పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి సత్యనారాయణ, రామకృష్ణ మాట్లాడుతూ పని లేని రోజుల్లో పనులు కల్పించాలని చట్టంలో ఉన్నా గ్రామాల్లో ఎక్కడా అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పని కల్పించకపోతే భృతి ఇవ్వాలని కోరారు. పని దినాలు వంద రోజులు అని చట్టం చెబుతున్నా 30 నుంచి 40 రోజులు మించి చూపటం లేదని పేదలు తెలిపారు. మండల నాయకులు తిరుమాని శ్రీనివాసరావు, కెవిపిఎస్ నాయకులు దాసి బాలయ్య పాల్గొన్నారు.



రైతులతో సమీక్షిస్తున్న వెంకటేశ్వరరావు

ఇ-పంట నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు

పోడూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో ఇ-పంట నమోదు విధి విధానాల ప్రకారం ఖచ్చితంగా జరగాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పోడూరు మండలంలోని వ్యవసాయ శాఖ అధికారులతో ఇ-పంట నమోదుపై సమీక్ష చేశారు. నమోదు విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. మండలంలో క్షేత్ర సందర్శనలో భాగంగా జగన్నాధపురం గ్రామంలో స్థానిక రైతు దరిశ రామ్మోహనరావు పొలంలో నూతన వరి వంగడం ఎంటియు 1426(చిరు సంచి) రకం పైరును పరిశీలించి, సలహాలు ఇచ్చారు. అక్కడ రైతులకు నూతన వరి రకాల సేద్యం గురించి సందేహాలు తీర్చారు. పాలకొల్లు వ్యవసాయ సహాయ సంచాలకులు అడ్డాల పార్వతి పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం: ప్రతి గ్రామానికి రహదారులు, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పెంటపాడు మండలం పడమర విప్పర్రు గ్రామంలో బిటి రోడ్డు నిర్మాణ పనులకు కూటమి నాయకులతో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. వలవల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **BALAM VENKATA LAKSHMI** W/o. Balam Venkatesh, D.No. 2-112, Near RCM Church, Kalipatnam, Mogalturu Mandal, W.G.Dt, A.P. I have changed my name from **BALAM VENAKTA LAKSHMI** (Old name) to **BALAM VENKATA LAKSHMI** (New name) hence forth I am being called **BALAM VENKATA LAKSHMI** W/o.Balam Venkatesh, for all purposes.

పాస్పోర్టు పోయినది

పాలకొల్లు పట్టణం, డోర్ నెం.50-7-5A, 22వ వార్డు, కొత్తపేట, పాలకొల్లు, ప.గో.జిల్లా ఎ.పి కి చెందిన శ్రీరా లతా మంగేష్కర్, భర్త: శ్యాంబాబు, పాలకొల్లు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్పోర్టు ఆఫీస్ నుండి 01-01-2003 న **E4366251. నెంబర్, పాస్పోర్టు** తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్పోర్ట్ను తీసుకొని ది. 17-01-2025 న పాలకొల్లులోని మా ఇంటి నుంచి మెయిన్ రోడ్కు జెరాక్స్ తీయించుటకు కేంద్రంకు వెళ్ళగా నేను వైజాగ్లో పొందిన నా ఒరిజినల్ పాస్పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్ కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెంబర్: 9949949289

In The Court Of The Assistant Commissioner of Labour Eluru (W.G.Dt)
W.C.No.17/2024

Between:
Janapareddy Nagalakshmi & anothers ... *Applicants*
and
P. Suryakala and Others ...*Opp. Partyes*
To:
1st opp.party: P. Suryakala, W/o (Late) Venkata Reddy, owner of Lorry (Oil Tanker) **No. Ap 37 V 1178, R/o D.No. 20C-11-31,** Gandhi Nagar, Eluru (W.G.Dt).
మీరు పై తెలిపిన **W.C No. 17/2024** లో 1st opposite Party అయి వున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున Hon'ble Assistant Commissioner of Labour, Eluru వారి ఉత్తర్వు ప్రకారం మీరు **ది. 4-02-2025 తేదీన మధ్యాహ్నం 3:00 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలను శ్రీ కోర్టు వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియ చేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
Applicants తరుపు న్యాయవాది
G.J.V.R.G SIVA SANKAR
Advocate, Eluru
Eluru
Dt. 24-01-2025.
Cell: 9666463737

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No. 153/2017 in O.S.No. 93/2012

Between:
Bolla Venkata Narayana ...Petitioner/1st Defendent
and
Bolla Perayya (Died) Bollempalli Krishnaveni & others ...*Respondent/Plaintiff*
Respondent No.5 : Bollempalli krishnaveni, W/o Satyanarayana, C/o Ch. Vasu Prakash, Annapoorna Apartments, Sivaji palem, Visakhapatnam.
యీ నెంబరు పై Sec-5 of Limitation Act Pelition లో 5వ రెస్పాండెంటుకు ఎన్ని పర్యాయములు Notice లు అమలు జరిపించినను సదరు 5th Respondent ను పిటీషనర్ చిక్కులు పెట్టవలెననీ దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నారు. ఆమెకు నోటీసులు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substitute of Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి సదరు రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది.03-02-2025వ తేదీకి** వాయిదా వేసివున్నారు. కావున సదరు వాయిదాకు సదరు పై 5వ రెస్పాండెంటు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం 10-00 గం॥లకు** శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
ఎన్. ఆనంద చక్రవర్తి, బి.కాం.బి.ఎల్.
నరసాపురం అడ్వకేట్
ది. 24-01-2025 నరసాపురం
సెల్: 9849145267

నోటీసు
మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 1/2024, O.S. 221/2005

Between:
DHr: Smt. Dharnalakota Annapurna
JDr's: 1. Smt. Polanati Savitri (died)
2. Sri. Vaddi Venkata Rao and 9 Others
To:
7. Smt. Buddala Durga Parvathi, W/o. Lakshmana Rao, Attili, Attili Mandal.
8. Sri. Musireddi Nageswara Rao, S/o. not known, Bayyanagudem, Koyyalagudem Mandal.
9. Sri. Musireddi Veera Venkata Satyanarayana Prasad, S/o. Nageswara Rao, Bayyanagudem
10. Sri. Musireddi Subba Rao, S/o. Nageswara Rao, Bayyanagudem.
11. Smt. Anisetti Annapurna, D/o. Musireddi Nageswara Rao, Bayyanagudem.
పై నెంబరులోని DHr పై నెంబరు E.P. ని మీ వగైరాలపై పై నెంబరు E.P. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ఒప్పగింత చేయమని దాఖలు చేయగా సదరు E.P. నందు 7 టు 11 JDR's అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు కోర్టు ద్వారా మరియు రిజిస్టరు పోస్టు ద్వారా పంపించినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సబ్స్టిట్యూట్ సర్వీసు ద్వారా ఆర్డరు వేసి వున్నారు. కావున పై నెంబరు E.P. నందు మీకు ఎట్టి అభ్యంతరములు వున్ననూ మీరు **ది. 30-01-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించడమగును.
MADDIPATI SRINIVAS
Station: Kovvuru Advocate, Kovvuru
Date: 20-01-25 Cell: 93466 50165

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తణుకు
E.P.No.179/2011, O.S.No.637/2008
పిటీషనర్/DHR: K.M.V.పద్మ కుమారి
And
JDR : పినిపే నాగేశ్వరరావు వగైరా
మార్ట్గేజర్ లీడర్ హైర్స్ :
1.మానూరి పరిపూర్ణ, W/o.మానూరి సూర్యనారాయణ, NTR విగ్రహం దగ్గర, తేతలి, తణుకు రూరల్ మండలం.
2.మానూరి దుర్గారావు, ప్రైవేటు ఎంప్లాయి, NTR విగ్రహం దగ్గర, తేతలి.
3.మానూరి సుధాకర్, తాపీమేస్త్రి, NTR విగ్రహం దగ్గర, తేతలి.
4.మానూరి దివాకర్, S/o.సూర్యనారాయణ, తాపీమేస్త్రి, NTR విగ్రహం దగ్గర, తేతలి.
పై నంబరు గ్రంథములో DHR, JDR లపై దావా డిక్రీ పొంది అత్తిలి గ్రామం, ఇంటి ప్రాపర్టీ వేలం కొరకై EP దాఖలు చేయగా సదరు ఆస్థి మానూరి సూర్యనారాయణ, S/o.సత్యనారాయణ, తేతలి గ్రామం వారికి 25-8-2000 సంవత్సరంలో అత్తిలి సబ్రిజిస్ట్రారు ఆఫీసులో తనఖా ఉన్నట్లు మరియు కోర్టు వారి ఆర్డరుపై మానూరి సూర్యనారాయణ గార్కి శ్రీకోర్టు వారు వారి అభ్యంతరములు కొరకు నోటీసు చేయగా మానూరి సూర్యనారాయణ గారు చనిపోయినట్లు ఎండార్సుమెంట్ రాగా పైన 1 to 4 వారలు వారి వారసులకు వారి తరపు అభ్యంతరములు చెప్పుకొనుటకు శ్రీకోర్టు వారి ఎదుట 03 ఫిబ్రవరి 2025 తేదీలో హాజరై తనఖాపై వారి అభ్యంతరములు తెలియజేయవలసి ఉన్నది. సదరు తేదీలో మీ ఆక్షేపణలు తెలియజేయనిచో శ్రీకోర్టు వారి చర్యలకు బాధ్యులగుదురు.
బండారు సుబ్బారావు
తణుకు అడ్వకేట్, తణుకు.
08-01-2025 సెల్: 9381784461

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE
Roc. No.2422/E1/2023-24 **Dated.24-01-2025**

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Supply and delivery of tyres and tubes for compactors, replacement of starlers at head water works and repairs and patch works works-04 Nos 4	General Funds	16.46	25-01-2025	01-02-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site http://tender.apeprocurement.gov.in
Sd/- **COMMISSIONER**
TADEPALLIGUDEM MUNICIPALITY

నరసాపురం పురపాలక సంఘము
'e' ప్రొక్యూర్మెంటు టెండర్ నోటీసు
ఆర్.ఒ.సి. నెం. 249/2023-ఇ.1. **ది. 24-01-2025**
మరియు 587/2025-ఇ.2.
నరసాపురం పురపాలక సంఘము నందు 15వ ఆర్థిక సంఘం నిధులు & మునిసిపల్ సాధారణ నిధులతో వివిధ పనులు చేపట్టుటకు
1.బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం : 25-01-2025 ఉ॥గం.11.30 లకు
2.బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 12-02-2025 సా॥గం.4.00 లకు
3.ప్రెస్ బిడ్ తెరువు తేది మరియు సమయం : 12-02-2025 సా॥గం.4.30 లకు
తదుపరి వివరాలను **www.eprocurement.gov.in** లోని **'e'** ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.
కమిషనర్
నరసాపురం పురపాలక సంఘం నరసాపురం మున్సిపాలిటీ.
నరసాపురం ఫోన్ నెం. 08814-273332